క్లుప్తంగా

శ్మశానవాటికలో వసతులు కల్పించండి



కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లెలగూడ నాయకులు

మీర్‌పేట: శ్మశానవాటికలో వసతులు కల్పించాలని జిల్లెలగూడకు చెందిన స్థానిక నాయకులు గురువారం మీర్‌పేట మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. సాయినగర్ శ్మశానవాటిక అభివృద్ధికి గతంలో రూ.1కోటి నిధులు మంజూరైనప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంతో అంత్యక్రియల కోసం వచ్చే వారు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. శ్మశానవాటికకు ప్రహరీ, లైట్లు, నీటి వసతి కూడా లేదని, అంతేగాకుండా మహిళలు స్నానాలు చేసేందుకు గదులు లేక పరదాలు ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీనికి కమిషనర్ స్పందించి వీలైనంత త్వరగా వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కోడూరు సోమేశ్వర్, బచ్చనమోని నర్సింహాయాదవ్, కాశీరాం యాదవ్, గోపినాథ్, వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత



వధువుకు పుస్తె, మెట్టెలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ రఘుపతిగౌడ్

మహేశ్వరం: మండల పరిధిలోని చిన్న తూప్ర గ్రామానికి చెందిన దేశాల మంజుల–యాదయ్య కుమార్తె, మోడిళ్ల అరుణ– భీమేశ్‌ల కుమార్తెల వివాహాలకు గ్రామ మాజీ సర్పంచ్ కొండా రఘుపతిగౌడ్ గురువారం పుస్తె, మెట్టెలు అందజేశారు. భవిష్యత్‌లో గ్రామంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఏబీవీపీ మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం: ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే ఏబీవీపీ భాగ్యనగర మహాసభలను విజయవంతం చేయాలని ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాసభల వాల్‌పోస్టర్‌ను గురువారం నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివకృష్ణ, పృథ్వీతేజ, రాజేశ్, రాఘవేందర్, సయిద్, శ్రీకాంత్, రోహిత్, సిద్ధు, చరణ్, నిఖిల్, వైష్ణవి, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రజా విజయోత్సవాలు



పారిశుద్ధ్య పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ వాణి

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన ప్రజా విజయోత్సవాలు మున్సిపాలిటీ వ్యాప్తంగా గురువారం ఐదోరోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రావిర్యాల గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ప్రజలకు, విద్యార్థులకు సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. చైర్‌పర్సన్ బరిగెల హేమలత, కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, కౌన్సిలర్లు శివకుమార్, భావన, రాజు, సీనియర్ అసిస్టెంట్లు మల్లేశ్, జంగయ్య, వార్డు అధికారులు అశోక్, మహేశ్ ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కొందుర్గు: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అందరూ సిద్ధం కావాలని ఎంపీడీఓ లక్ష్మి అనురాధ సూచించారు. గురువారం గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌లు సరిగా ఉన్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. చిన్నపాటి మరమ్మతులు ఉంటే బాగు చేయించాలన్నారు. ఈ నెల 7న గ్రామ పంచాయతీ నోటీసు బోర్డుపై ముసాయిదా పోలింగ్ బూత్‌ల జాబితా వేయాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- బీఆర్‌ఎస్ జల్‌పల్లి యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న యంజాల అర్జున్

మహేశ్వరం: పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించకపోవడం సమంజసం కాదని బీఆర్‌ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి సూచనల మేరకు గురువారం అర్జున్ నేతృత్వంలో నాయకులు జల్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మొత్తం 250 మంది విద్యార్థులకు గాను 177 మంది విద్యార్థులే హాజరు కావడం హాజరైన వారికి కూడా నాణ్యమైన ఆహారం అందించడంలేదని మండిపడ్డారు. పాఠశాలలలో అందజేస్తున్న భోజనంలో పురుగులు, రాళ్లు ఉంటుండడంతో టిఫిన్ బాక్స్‌లలో ఇంటి భోజనం తెచ్చుకుంటున్నామని ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వెల్లడించారు. బియ్యం సైతం నాణ్యమైనవి పంపించడం లేదని వంట చేస్తున్న మహిళలే నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. సబితారెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రతి పాఠశాలలో చక్కటి ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇటీవల గురుకులాలలతో పాటు పాఠశాలల్లో కూడా కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సరైన ఆహారం అందించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఇద్రీస్, జహంగీర్, సాదిక్, సిద్ధూ, బి.అరవింద్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



గురుస్వామి రాకేశ్‌గౌడ్‌తో పూజలో పాల్గొన్న స్వాములు

వైభవంగా పడిపూజ

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరుకు చెందిన రాకేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని నవారు బాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో అ య్యప్పస్వామి 18వ మెట్టు పడిపూజను వైభవంగా నిర్వహించారు.గురుస్వామి చంద్రమోహన్‌నాయర్ సమక్షంలో స్వాములు స్వామివారికి అభిషేకం, ప డిపూజ కార్యక్రమాలు చేశారు. 18వ సారి మాల ధారణ పూర్తి చేయనున్న రాకేశ్‌గౌడ్‌ను ప్రత్యేకంగా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి



నందిహిల్స్‌లో పార్టీ సభ్యత్వం అందజేస్తున్న రవీంద్రాచారి

మీర్‌పేట: కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి అన్నారు. సీపీఐ పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి నందిహిల్స్‌లో గురువారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తకు సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం పేద ప్రజల పక్షాన నిస్వార్థంగా పోరాటం చేసేదే సీపీఐ పార్టీ అని తెలిపారు. గత వందేళ్లలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు పేద ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, పార్టీ సభ్యత్వాన్ని పెద్దఎత్తున చేపట్టి కిందిస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జర్పుల శివనాయక్, జాజుల అంజయ్య, బండ యాదమ్మయాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నాయకుడు దత్తాత్రేయ

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పార్టీ అభివృద్ధికి బండారు దత్తాత్రేయ క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. చండీఘడ్‌లోని రాజ్‌భవన్‌లో గురువారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను శ్రీవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన బండారు దత్తాత్రేయ సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎంపీగా, గవర్నర్ స్థాయికి ఎదిగారన్నారు. బండారు దత్తాత్రేయ గత 35 సంవత్సరాలుగా బీజేపీ సిద్ధాంతానికి పాటుపడుతున్నారన్నారు. పార్టీ బలోపేతానికి దత్తాత్రేయ ఎంతో కృషి చేశారని, పార్టీ సిద్ధాంతం కోసం పనిచేసిన కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు.

యూత్ కాంగ్రెస్ నూతన ప్రతినిధుల నియామకం



సుభాన్‌యాదవ్



గొల్లూరు రాజు



షేక్ జహీరుద్దీన్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన వల్లపు సుభాన్‌యాదవ్ మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్‌కు వివిధ విభాగ స్థాయిలో నూతన కార్యవర్గాలను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గానికి మొత్తం 13 మంది ఎన్నికల బరిలో నిలువగా 2050 ఓట్ల మెజార్టీతో విజయం సాధించి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయం సాధించాడు. ఈ సందర్భంగా సుభాన్‌యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓటు వేసిన కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు తన ఎన్నికకు సహకారం అందించిన పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మండల అధ్యక్షుడిగా రాజు

మహేశ్వరం: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిన్న తూప్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు గొల్లూరు రాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత పారిజాతనర్సింహారెడ్డిల నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

శుభాకాంక్షలు

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన యూనుస్‌కు పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి గురువారం శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సరూర్‌నగర్‌లోని యూనుస్‌ను నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో నాయకులు పున్న గణేశ్‌నేత, చిలుక ఉపేందర్‌రెడ్డి, ధన్‌రాజ్ గౌడ్, భూపాల్‌రెడ్డి, ఇమ్రాన్, షఫీ, జంగారెడ్డి, అజీజ్ పాల్గొన్నారు.

నియామకం

కందుకూరు: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కందుకూరుకు చెందిన సొడపు వెంకటేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో నిర్వహించిన ఆన్‌లైన్ ఓటింగ్‌లో మండల పరిధి నుంచి నలుగురు పోటీ పడగ వెంకటేశ్‌గౌడ్‌కు అధిక మెజార్టీ వచ్చింది. దీంతో పార్టీ ఆయన ఎన్నికను ధ్రువీకరిస్తూ ప్రకటించింది. ఈ మేరకు గురువారం నూతన యూత్ అధ్యక్షుడిగా ఎన్నికై న వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. తన ఎంపికకు సహకరించిన పార్టీ మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా పీసీసీ నాయకులు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, సరికొండ మల్లేశ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణ నాయక్, సీనియర్ నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, అందుగుల సత్యనారాయణ, ఎస్.జగన్, వి.బాబు, కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్, మహేందర్, గణేశ్‌నాయక్, శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, నవీన్, ప్రశాంత్ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాన కార్యదర్శిగా షేక్ జహీరుద్దీన్

పహాడీషరీఫ్: కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా జల్‌పల్లికి చెందిన షేక్ జహీరుద్దీన్ గురువారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమ లు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కృషి చేస్తానన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో యువతకు అన్నిరకాల సహాయ సహకారాలు అందించేలా చూస్తానన్నారు.

సీఎం కప్'నకు రిజిస్టర్ చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీఓ కృష్ణయ్య

కేశంపేట: సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 7, 8తేదీలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీఓ కృష్ణయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల పీఈటీలు, సీఎం కప్ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీఓ కృష్ణయ్య మాట్లాడుతూ.. సీఎం కప్‌లో పాల్గొనే క్రీడాకారులు, గ్రామాల్లో యువత పంచాయతీ కార్యదర్శులకు పేర్లను ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ అజీజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి

షాబాద్: గ్రామస్థాయి క్రీడాపోటీలకు ఆసక్తి గల క్రీడాకారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 7, 8వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీఎం కప్–2024 క్రీడాపోటీల్లో భాగంగా అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగాపై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం మీ గ్రామంలోని పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

హామీల అమలులో విఫలం

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి
- శంకర్‌పల్లిలో భారీ బైక్ ర్యాలీ



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని, ఆరు గ్యారెంటీలు అని చెప్పి 66 మోసాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక పాలనను నిరసిస్తూ గురువారం శంకర్‌పల్లి పట్టణంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హామీలు అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి మెమోరాండం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క–సారలమ్మలపై ఒట్టేసి చెప్పి, ఇప్పుడు మాట తప్పాడని ఆరోపించారు. అదేవిధంగా రైతులకు రైతుబంధు, పింఛన్ రూ.4వేలు, రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయలేదన్నారు. గడిచిన ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారానికే తప్పా సామాన్యుడికి మంచి చేసిన పని ఒక్కటి లేదని విమర్శించారు. ఇప్పటికై నా తమ పాలన విధానాన్ని మార్చుకొని ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్‌కన్నా, బీర్ల నర్సింహ, వెంకటేశ్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్

షాద్‌నగర్‌రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను విమర్శించే స్థాయి నీకు లేదని పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిపై మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్ తీవ్ర విమర్శలు చేశారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణం నుంచి బైపాస్ రోడ్డువైపు మరోమార్గం ఉండే విధంగా వైజంక్షన్ నిర్మించడానికి చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా రూ.90కోట్లు మంజూరు చేయించామన్నారు. ఎమ్మెల్యేపై కాంగ్రెస్ పార్టీపై విష్ణువర్ధన్‌రెడ్డి నోటికొచ్చినట్లు ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేదిలేదన్నారు. పదేళ్ల పాలనలో రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టడంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలోనే రైతులకు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై విజయోత్సవాలు చేస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణారెడ్డి, రఘునాయక్, కొంకళ్ల చెన్నయ్య, ఎండీ.ఇబ్రహీం, బస్వం, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్, ముబారక్, కరుణాకర్, యాదగిరియాదవ్, అన్వర్, హుస్సేన్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌పై విమర్శలు సరికాదు

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథ్

చేవెళ్ల: మండలంలోని ఆలూరు వద్ద జరిగిన లారీ ప్రమాదంలో పేద రైతుల మృతికి కారణం గత బీఆర్‌ఎస్ పార్టీనే అని, ఈ హైవేను పట్టించుకోకపోవటంతోనే ప్రమాదం జరిగిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడటంపై బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ తీవ్రంగా మండిపడ్డారు. చేవెళ్లలో గురువారం ఆయన బీఆర్‌ఎస్వీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అధికారం పోగానే బీఆర్‌ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్‌లోకి ఏమి ఆశించి పోయారో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎమ్మెల్యేకు ఉందన్నారు. నీలాంటి వలస పక్షి అవకాశవాదులు ఇలాంటి మాటలు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్ ప్రయాణించే ఈ హైవే రోడ్డు ఇంత దారుణంగా ఉండటం చూస్తూ కూడా ఏడాది కాలంగా కనీసం స్పందించకపోవటం శోచనీయమన్నారు. పేద రైతుల ప్రాణాలు పోయిన తర్వాత ఈ రోడ్డు గుర్తుకు వచ్చిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న ఎమ్మెల్యే ఏనాడు ఈ రోడ్డు ప్రస్తావన తీసుకురాలేదని అప్పుడు ఏమి చేశాడని ఎద్దేవా చేశారు. పార్టీలో ఉన్న ఉద్యమకారులను, పార్టీ కోసం పనిచేసిన వారిని పట్టించుకున్న పాపన పోలేదన్నారు. ఎమ్మెల్యేగా తాను చేయాల్సిన పనిని గాలికి వదిలేసి బీఆర్‌ఎస్‌పై అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు ఆసిఫ్, నరేశ్, పృథ్వీ, తేజ, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్

కేశంపేట: నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఎన్ఎస్‌యూఐకి ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన అనుమగళ్ల రమేశ్, తాలుకా ఉపాధ్యక్షులుగా నిర్దవెల్లి గ్రామానికి చెందిన అమీర్, కొత్తపేట గ్రామానికి చెందిన శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇప్పలపల్లి గ్రామానికి చెందిన పిప్పళ్ల శ్రీనాథ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని నాయకులు సన్మానించారు. వీరితో పాటు ఇటీవల మార్కెట్ కమిటీలో ఎంపికై న డైరెక్టర్లు నిర్దవెల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌గౌడ్, కొండారెడ్డిపల్లికి చెందిన కరుణాకర్‌ను మండల కేంద్రంలోని చర్ల మైసమ్మ దేవాలయం ప్రాంగణంలో సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న వీరేశ్ పాల్గొని మాట్లాడుతూ.. సంవత్సర కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో యెన్నం శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పర్వతాలు, గిరి, భాస్కర్, రాజేందర్, రాములు, గోపాల్, నగేశ్, భీమయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ సభ్యుల నియామకం

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ యువజన కమిటీ ఎన్నికలలో నూతన కమిటీ ఎన్నికైంది. ఇందులో చేవెళ్ల మండల యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పలుగుట్ట గ్రామానికి చెందిన మల్గారి కార్తీక్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షుడిగా ఎన్కేపల్లి గ్రామానికి చెందిన కందికొండ మహేందర్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తానని చెప్పారు. మండలంలో యువజన కాంగ్రెస్‌ను గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు పార్టీకి అండగా యువజన కాంగ్రెస్ ఉంటుందని చెప్పారు.తమ ఎన్నికకు కృషి చేసిన పార్టీ నాయకులు,యువకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం

శంకర్‌పల్లి: ఇటీవల ప్రకటించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల్లో శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామానికి చెందిన మోత్కుపల్లి మహిపాల్ చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా.. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన బొల్లారం ప్రశాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. యువత సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు.



కేశంపేట: యూత్ నాయకులను సన్మానిస్తున్న మండల అధ్యక్షుడు వీరేశ్

యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ



కొందుర్గులో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ

కొందుర్గు: యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం సీఎం కప్ పోటీలు ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ లక్ష్మిఅనురాధ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో క్రీడాకారులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డి, ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7, 8 తేదిలో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి, 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు నెంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఎంఈఓ గాయత్రీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ స్వాములు, బాలాజీ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386